ముమ్మరంగా వాహనాల తనిఖీ

పెద్దాయిపల్లి చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మాచారెడ్డి/కామారెడ్డి రూరల్/రాజంపేట/బీబీపేట్, అక్టోబర్ 25 : ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, ఇతర వస్తువులను అక్రమంగా తరలించకుండా పోలీసులు, అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. బుధవారం పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ ముమ్మరం చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు తరలిస్తే దానికి తగిన పత్రాలు ఉండాలని లేనిపక్షంలో డబ్బులు సీజ్ చేస్తామని తెలిపారు. వాహన దారులు తగిన జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కామారెడ్డి మండల కేంద్రంలోని టేక్రియాల్ గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేసినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. రాజంపేట మండలం పెద్దాయిపల్లి చౌరస్తాలో ఎస్సై సంపత్ పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. అక్రమ మద్యం, పరిమితికి మించి డబ్బులు తీసుకెళ్లొద్దని తెలిపారు. ఈ తనిఖీలో ఏఎస్సై గంగారెడ్డి, కానిస్టేబుళ్లు కృష్ణారెడ్డి, భాస్కర్ ఉన్నారు. బీబీపేట్ మండలం జనగామ రోడ్డులో ఎస్సై సాయిరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. హెడ్ కానిస్టేబుల్ మల్లేశం, సిబ్బంది నవీన్‌కుమార్, రంజిత్‌గౌడ్ పాల్గొన్నారు.

జనగామలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆర్థిక సహాయం అందజేత

భిక్కనూరు, అక్టోబర్ 25 : మండలంలోని పెద్దమల్లారెడ్డికి చెందిన ఇద్దరు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ బుధవారం చెట్కురి మల్లయ్య కుటుంబ సభ్యులకు రూ.ఐదు వేలు, నాయిని బాల్‌రాజ్ కూతురు వీణశ్రీ కుటుంబ సభ్యులకు రూ.ఐదు వేలు బీఆర్ఎస్ నాయకులు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రాజాగౌడ్, ఎంపీటీసీ సాయాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు రాజలింగం, గోల్కొండ రాములు, సతీశ్‌రెడ్డి, బాలాజీ, సాయిలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా దుర్గామాత శోభాయాత్ర

నస్రుల్లాబాద్‌లో నిమజ్జనానికి తరలుతున్న దుర్గామాత

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

పలు గ్రామాల్లో అన్నదానం

నస్రుల్లాబాద్, అక్టోబర్ 25 : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో యువ భారత్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహానికి బుధవారం నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల దాండియా ఆటలు వీక్షకులను అలరించాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంగళహారతులతో స్వాగతం పలికారు. అందంగా అలంకరించిన వాహనంపై దుర్గామాత విగ్రహాన్ని ఉంచి వీధుల్లో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు.

కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అన్నదానం

దోమకొండ, అక్టోబర్ 25 : దోమకొండలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బుధవారం నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, వాసవీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో పాల్గొన్న మాలధారులు, గ్రామస్తులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

బోర్లం గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి చెక్కును అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు శ్రావణి

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 25 : మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన సంగెం సుజాత్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.20వేల చెక్కును స్థానిక నాయకులతో కలిసి ఎంపీటీసీ సభ్యురాలు శ్రావణి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి నుంచి సకాలంలో ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంద శ్రీనివాస్, బోర్లం సొసైటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు గోపన్‌పల్లి సాయిలు, నాయకులు సయ్యద్ అమీన్, గంగాధర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన స్పీకర్

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, అక్టోబర్ 25 : పట్టణంలోని పాత బాన్సువాడలో కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్న బీ.నారాయణరెడ్డిని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. స్పీకర్ వెంట రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ ఏర్వాల కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

బైక్‌పై నుంచి పడి బాలుడి మృతి

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 25 : నిజామాబాద్ నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన బాలుడు దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు తెలిపారు. ఈ నెల 24న అర్ధరాత్రి 12 గంటల సమయంలో బైక్‌ను నేనావత్ నితిన్ నడుపుతుండగా.. నేనావత్ శ్రీనివాస్ (17) బైక్ వెనకాల కూర్చున్నాడు. బైక్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో వెనకాల కూర్చున్న శ్రీనివాస్ కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయాలు కాగా.. దవాఖానలో చేర్చించారు. బాలుడి పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

డిచ్‌పల్లి, అక్టోబర్ 25 : మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన కొక్కుల గంగాధర్ (45) బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు

28న చంద్రగ్రహణం

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 23 : ఈనెల 28వ తేదీన అర్ధరాత్రి పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడుతుందని ప్రముఖ జ్యోతిష్య పండితుడు పవన్ జోషి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్ధరాత్రి 1.06 నుంచి నుంచి అర్ధరాత్రి 2.25 గంటల వరకు గ్రహణ ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. అశ్విని, మేష, తుల, మీనరాశి వారు గ్రహణాన్ని చూడవద్దని తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం 4 నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు ఉమ్మడి జిల్లాలోని ఆలయాలను మూసి ఉంచుతారని, సంప్రోక్షణ అనంతరం పూజలు కొనసాగుతాయని తెలిపారు.

రేపు నిధి ఆప్‌కే నిఖత్

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 25 : నిధి ఆప్ కే నిఖత్ 2.0 కార్యక్రమాన్ని ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు నిజామాబాద్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ గణేశ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రావణ్‌కుమార్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని ప్రెసిడెన్సీ హైస్కూల్‌లో, కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషిచేస్తామని తెలిపారు.